క్లుప్తంగా

నేడు మూడు మండలాల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పర్యటన

రొంపిచెర్ల/పులిచెర్ల(కల్లూరు)/సదుం: రొంపిచెర్ల, సదుం, పులిచెర్ల మండలాల్లో సోమవారం మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. తొలుత పెద్దగొట్టిగల్లు పంచాయతీలోని వీఎంఆర్ కల్యాణ మండపంలో ఉదయం 9:30 గంటలకు, ఆ తర్వాత పులిచెర్ల మండలం కల్లూరులోని సినిమా థియేటర్‌లో, తదనంతరం సదుం మండలంలోని ఎర్రాతివారిపల్లెలో బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని ఆయా మండలాల నేతలు తెలిపారు. సమావేశానికి వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు,సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కర్ణపేయం.. త్యాగరాజ సంకీర్తనం



కీర్తనలను ఆలపిస్తున్న కళాకారులు

పలమనేరు: పట్టణంలోని కళామందిరంలో ఆదివారం నిర్వహించిన త్యాగరాజ సంకీర్తన కచేరి కర్ణపేయంగా సాగింది. జాయినింగ్ ద డాట్ ఫౌండేషన్, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు సాయితేజస్ చంద్రశేఖర్ గానం, అర్జున్ దినకరన్ వయోలిన్, నాగరాజు మృదంగం, సుమనా చంద్రశేఖర్ ఘటంపై సహకారం అందించారు. కార్యక్రమంలో పలువురు సాహిత్య, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

వీధికుక్కలకు ఆహారం

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని వీధి కుక్కలకు పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్తలు మోహన్, జయశంకర్ ఆదివారం ఆహారం పెట్టారు. కుక్కలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలను ఎంపిక చేసుకుని శునకాలకు అవసరమైన బన్నులను పెట్టామని, ఇకపై వారానికోసారి ఈ సేవా కార్యక్రమం కొనసాగించనున్నట్లు చెప్పారు.

వేడుకగా బలిబండి



ఊరేగుతున్న బలిబండి

సదుం: మండలంలోని భట్టువారిపల్లె వద్ద పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం భీముని పాత్రధారి బలిబండిపై సమీప గ్రామాల్లో మేళతాళాలతో ఊరేగారు. భక్తులు పూజలు చేసి, ఆహార పదార్థాలను బండికి సమర్పించారు. మధ్యాహ్నం భాగవతారిణి జ్యోత్స్న హరికథాగానం చేశారు. రాత్రి వేంకటేశ్వర నాట్య కళామండలి నాటక ప్రదర్శన అందరినీ అలరించింది.

22న మామిడి రైతు మహా జనసభ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రపంచ మామిడి దినోత్సవం సందర్భంగా ఈనెల 22న మామిడి రైతు మహాజనసభ నిర్వహిస్తున్నట్లు మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. చిత్తూరు నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఈ సభను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు సంఘ సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు.

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు
- చౌడేపల్లెలో బాబు షూరిటీ..మోసం గ్యారంటీ విజయవంతం
- కొత్త జోష్‌తో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే దిశా నిర్దేశం

గడప గడపకూ బాబు మోసాలు చాటిచెబుదాం



చౌడేపల్లె: రాబోయే రోజుల్లో గ్రామస్థాయిలో నూతనంగా ఏర్పాటు చేయబోయే గ్రామ కమిటీలే కీలకమని ఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం చౌడేపల్లెలోని ఓ కల్యాణ మండపంలో 'బాబు షూరిటీ... మోసం గ్యారంటీ బార్ కోడ్' ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల అనంతరం తొలిసారిగా ఏర్పాటు చేసిన పార్టీనేతలు, కార్యకర్తల సమావేశానికి పెద్దిరెడ్డి కొత్త జోష్ నింపారు. ఆయనకు పార్టీ నేతలు, ఘనస్వాగతం పలికారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, ఎన్నికలప్పుడు చంద్రబాబు ప్రజలకు సూపర్‌సిక్స్‌తోపాటు 143 హామీలను ఇచ్చి ఏడాది దాటినా ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. మోసపూరిత పాలన ప్రారంభమై సుమారు 14 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి దోచుకోవడానికి పెద్దపీట వేశారన్నారు. ప్రతిఇంటికీ ఇంత ఇస్తాం..అంత ఇస్తామంటూ టీడీపీ ప్రచారం చేస్తూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల సంతకాలతో ఇచ్చిన బాండ్లు ఏమయ్యాయని సూటిగా ప్రశ్నించారు. కరెంటు చార్జీలు పెంచేది లేదని చెప్పి ఇష్టానుసారంగా ఐదుసార్లు చార్జీలు పెంచి ప్రజలకు చంద్రబాబు షాక్ ఇచ్చారని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలతో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తూ ప్రజలను మోసం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను అందరూ ప్రతి గడప గడపకూ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

కార్యకర్తల జోలికొస్తే సహించం

తమ పార్టీ నాయకులు, కార్యకర్తల జోలికొస్తే ఇక ఏమాత్రమూ సహించలేది లేదని, అసలు వడ్డీతో సహా చెల్లిస్తామని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హెచ్చరించారు. అక్రమకేసులు, దౌర్జన్యాలను ఉపేక్షించేది లేదని, ఎవరిని ఏ రూపంలో ఇబ్బంది పెట్టినా అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు. అలాగే తమ కుటుంబం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. నాయకులందరూ కలిసిమెలసి ఏ కార్యక్రమం జరిగినా ఇదే ఉత్సాహంతో పాల్గొనాలన్నారు. గ్రామస్థాయిలో బార్‌కోడ్‌ల ద్వారా స్కాన్ చేయించి కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలను నెరవేర్చకపోవడం, వారు చేస్తున్న అవినీతి, అక్రమాలు, అన్యాయాలను ప్రజలకు వివరించి చైతన్యవంతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, అనూషారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, వెంకటరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సోమలలో..

సోమల (చౌడేపల్లె): ఇంటిటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు చాటిచెప్పాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కందూరు మార్గంలోని షావలి మామిడికాయల మండీలో పార్టీనేతలు, కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. బాబు షూరిటీ మోసం–గ్యారంటీ బార్‌కోడ్‌లను నేతలతో కలిసి ఆవిష్కరించారు. నాయకులందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ ఈశ్వరయ్య, మండల కన్వీనర్ గంగాధరం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు మోహన్, నాగేశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, నేతలు పాల్గొన్నారు.







మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న చెంగారెడ్డి

కూటమి ప్రభుత్వం రాక్షస పాలన

– జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పుంగనూరు: సూపర్‌సిక్స్‌తో పాటు ఇతర హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా చంద్రబాబు ప్రజలను మోసం చేశారని, ఈ మోసాలను ప్రజలకు ఇంటింటింటికీ వెళ్లి చాటిచెప్పాలని జెడ్పీ చైర్మన్ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పుంగనూరులో నిర్వహించిన బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులు, దాడులు, ఆస్తుల విధ్వంసంతో రాక్షస పాలన చేస్తోందని విమర్శించారు. దీనిపై తమ పార్టీ పోరాటం చేస్తుందన్నారు.

మోటారు సైకిల్ ర్యాలీ

బాబు షూరిటీ–మోసం గ్యారంలో కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర యువత కార్యదర్శి కొత్తపల్లి చెంగారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువకులు మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. స్థానిక టోల్‌గేట్ నుంచి పట్టణంలోని సభా ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికారు.

భక్తిప్రపత్తులతో విగ్రహాల ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న దృశ్యం

రొంపిచెర్ల: మండలంలోని కాకులారంపల్లెలో అభయాంజనేయస్వామి, రేణుక యల్లమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. విజయవాడకు చెందిన పీఠాధిపతులు కమలానంద భారతీస్వామి భగవద్భక్తి–కర్తవ్యదీక్ష–సమాజ శక్తి అనే నినాదంతో రాష్ట్రంలో హిందూ యువ చైతన్యం, విలువలతో కుటుంబాలు, ధార్మిక నాయకత్వం, పర్యావరణ పరిరక్షణ..ఇత్యాది అంశాలపై జూలై12న తలకోన నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివారం కాకులారంపల్లెలో మంచూరి రుక్మిణమ్మ నేతృత్వంలో ఘన స్వాగతం పలికారు.గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు.

భగవద్గీతపై ప్రచారం



భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేస్తున్న సభ్యులు

వి.కోట: భగవద్గీత జ్ఞానంతో సమాజంలో ఉన్న కులమతాల అసమానతలు తొలగి సర్వ మతాలకు దేవుడొక్కడేనని భావనతో దైవభక్తి పెంపొందుతుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం సభ్యులు మండలంలోని కొంగాటం పంచాయతీ గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపైబ ప్రచారం చేయడంతోపాటు ఆ గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, ప్రకాష్, శరవణ, రాజకుమార్, విమల, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆవుకు పునర్జన్మ



ఆపరేషన్ చేసి ఆవు కడుపులో నుంచి బయటకు తీసిన మృతి చెందిన దూడ ఇదే..

చౌడేపల్లె: కడుపులో మృతి చెందిన దూడను ఆపరేషన్ చేసి వెలికి తీసి ఆవుకు వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. వివరాలు ఇలా.. వెంగళపల్లె గ్రామానికి చెందిన గంగాధర్ రూ.80 వేలు విలువ చేసే ఆవును కొనుగోలు చేసి పోషిస్తూ పాల దిగుబడితో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆవుకు నెలలు గడుస్తున్నా దూడకు జన్మనివ్వకపోగా ఆవును డాక్టర్ పవన్‌కుమార్ వైద్యపరీక్షలు చేసి కడుపులో దూడ మృతి చెందినట్లు నిర్ధారించారు. వైద్యసిబ్బందితో కలిసి ఆవుకు ఆపరేషన్ చేసి కడుపులో మృతి చెందిన దూడను వెలికితీశారు. ప్రస్తుతం ఆవు ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్ తెలిపారు. వైద్యసిబ్బంది శ్రీనివాసులు,రెడ్డి, సురేంద్ర,హరిత పాల్గొన్నారు.

మధ్యంతర భృతి మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు

చిత్తూరు కలెక్టరేట్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి వెంటనే మంజూరు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు ఆదివారం ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి దృష్టికి క్షేత్రస్థాయి సమస్యలు తీసుకెళ్లారు. కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంతవరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి మౌనం వహించడం దారుణమన్నారు. వెంటనే 12వ పీఆర్సీ మధ్యంతర భృతి, పెండింగ్‌లో ఉన్న డీఏ (కరువుభత్యం) వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన టీచర్లకు, ఉద్యోగులకు రావాల్సిన గ్రాట్యుటీ, అర్ధ వేతన సెలవు నగదు, సరెండర్ లీవ్ బకాయిలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న రూ.25 వేల కోట్లను దశల వారీగా మంజూరు చేయాలన్నారు. ఎఫ్ఎల్ఎన్, లీడర్‌షిప్ వంటి శిక్షణా కార్యక్రమాలను రద్దు చేసి విద్యార్థులకు నిర్దేశించిన సమయానికి సిలబస్ పూర్తి చేసేలా సహకరించాలన్నారు. అనంతరం రాష్ట్ర నేతలకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, రాష్ట్ర నాయకులు కడియాల మురళి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు ఎనలేనివి



నగదు ప్రోత్సాహకాలు పంపిణీ చేస్తున్న నూతన అధ్యక్షుడు తమీమ్

వి.కోట: మండలంలో అంతర్జాతీయ లయన్స్ క్లబ్ సేవా సంస్థ చేస్తున్న సేవలు ఎనలేనివని సీఐ సోమశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పీఎంఆర్ కళ్యాణ మండపంలో వి.కోట లయన్స్ క్లబ్ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా డాక్టర్ తమీమ్‌ఖాన్, కార్యదర్శిగా ఇంద్రేష్, కోశాధికారిగా సయ్యద్ సాదత్, వైస్ ప్రెసిడెంట్లుగా తుకారాం, దామోదరరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథులుగా సీఐ, అమ్మా యాక్ట్ సంస్థ అధినేత దశరథరెడ్డి మాట్లాడారు. క్లబ్ నూతన అధ్యక్షుడు అధ్యక్షుడు తమీమ్ మాట్లాడుతూ, విద్య, వైద్యం, క్రీడలకు అధిక ప్రాధాన్యతను సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పట్టణ శివార్లలో చిరు దుకాణదారులకు గొడుగులు, మండలంలో ప్రతిభ కనబరచిన ఆరుగురు విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు నాగరాజేంద్ర, రమేష్, బాలగురునాథ్, మురుగేష్, నాగభూషణం, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

'పీఎం రోజ్ ఘర్ మేళా'లో దీపక్ రాజా ఎంపిక



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న దీపక్ రాజా

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీ నగిరి దళితవాడకు చెందిన వల్లిపాగు దీపక్ రాజా పీఎం రోజ్ ఘర్ మేళాలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. శనివారం తెలంగాణలోని సికింద్రాబాద్‌లో ×పీఎం రోజ్ ఘర్ మేళా×లో పాల్గొన్నారు. బీటెక్ పూర్తి చేసిన దీపక్‌రాజా 2023లో నిర్వహించిన జియొలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరీక్షలో ప్రతిభ కనబరచి ఉద్యోగానికి ఎంపికయ్యారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని శనివారం అందుకున్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో కూడా మండల టాపర్ కావడం విశేషం! అతని ఎంపికై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

35 మందికి కంటి వైద్య పరీక్షలు





బైరెడ్డిపల్లెలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సదుంలో..

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఆదివారం చెన్నై శంకర నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 55 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించి 35 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారికి చెన్నైలో ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మురళి, కృష్ణ, శ్రీనివాసులు, రమణ, గంగాధరం, నిర్వాహకులు చంద్రప్ప, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

సదుంలో 16మంది..

సదుం: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆదివారం శ్రీవేంకటేశ్వర అరవింద్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 40 మంది రోగులకు నిపుణులు పరీక్షించి 16మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తవణంపల్లె: తిరుపతి–బెంగళూరు హైవే రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. వివరాలు.. కొందరు తిరుపతి నుంచి కారులో స్వర్ణ దేవాలయం వెళ్తుండగా పాకాల మండలం దామలచెరువుకు చెందిన జీ.చంద్రమౌళి(31) ద్విచక్రవాహనంలో ఆపోజిట్ మార్గంలో అతివేగంగా వచ్చి హైవేలోని నత్తపుచేను రోడ్డు దగ్గర కారును ఢీకొన్నాడు. ప్రమాదంలో చంద్రమౌళి తీవ్రంగా గాయపడడంతో రక్తస్రావం అధికంగా జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ గోవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

దొరికిన దొంగలు

చిత్తూరు కార్పొరేషన్: రైళ్లలో చోరీలు చేస్తూ తప్పించుకు తిరుగుతున్న దొంగలు ఎట్టకేలకు దొరికారు. గత నెల 26న సిద్ధంపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రైలులో ప్రయాణికుల నుంచి దాదాపు 50 గ్రాములకు పైగా నగలను దొంగలు దోచుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మహారాష్ట్ర సహా పలు ప్రాంతాల్లో గాలించి ఇద్దరు దొంగలను అదుపులో తీసుకున్నారు. సోమవారం దొంగల అరెస్టును పోలీసు గెస్టుహౌస్‌లో మీడియాకు చూపనున్నారు.

రిజిస్ట్రేషన్ల రద్దు అధికారం కలెక్టర్లకు

చిత్తూరు కలెక్టరేట్: భూ ఆక్రమణలను అడ్డుకునేందుకు కొత్త రిజిస్ట్రేషన్ చట్టాన్ని అమలు చేసేందుకు పూనుకుంటున్నారు. ఈ చట్టం ప్రకారం ఎవరైనా అక్రమంగా భూములను రిజిస్ట్రేషన్ చేయించుకుంటే అటువంటి వాటిని కలెక్టర్ నేతృత్వంలో కమిటీకి రద్దు చేసే అధికారాన్ని ప్రభుత్వం కల్పించినట్లు అధికారులు చెప్పారు. అక్రమదారులతో నిజమైన హక్కుదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన రెవెన్యూ సమీక్షలో కొత్త రిజిస్ట్రేషన్ చట్టం అమలుపై కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ ఆదేశాలను అమలు చేసేందుకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించింది.

ఇప్పటి వరకు సివిల్ కోర్టుకు

సాధారణంగా భూములు అక్రమంగా ఎవరైనా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సంబంధిత బాధితులు సివిల్ కోర్టును ఆశ్రయించేవారు. పలు కేసులు విచారణ ముగిసేకి సమయం పడుతుండేది. దీంతో ఆలోపు సంబంధిత భూములు పలువురు చేతులు మారిపోయేవి. అలాంటి పరిస్థితులకు అడ్డుకట్ట వేసేందుకు కలెక్టర్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. అలా ఏర్పడే కమిటీ అక్రమ రిజిస్ట్రేషన్లు ఎక్కడైనా జరిగితే విచారణ చేసి రద్దు చేస్తుందని కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

వర్షం కోసం..!

- అక్కదేవతలకు పూజలు
- దశాబ్దాలుగా బైరెడ్డిపల్లెలో పాటిస్తున్న సాంప్రదాయం
- ప్రత్యేక పూజలు చేస్తే వర్షం పడుతుందని రైతన్నల నమ్మకం



ప్రత్యేక పూజలందుకున్న అక్కదేవతలు

సాధారణంగా జూన్‌లో వర్షాలు కురిసి జూలైలో వేరుశనగ విత్తనాలు వేయాల్సి ఉంది. అయితే ఈ పర్యాయం వరుణుడు ముఖం చాటేశాడు. ఇంతవరకు వర్షాల జాడే లేకపోవడంతో పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో 99శాతం చేలల్లో విత్తనాలు వేయలేదు. ఆకాశంకేసి చూస్తున్న రైతన్నలు ఆదివారం బైరెడ్డిపల్లెలో అక్కదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

పలమనేరు/బైరెడ్డిపల్లె: బైరెడ్డి వంశీకుల కారణంగా బైరెడ్డిపల్లె అని పేరువచ్చినట్లు గ్రామపెద్దలు చెప్పేమాట. దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్న సమయంలో అక్కదేవతలకు పూజలు చేస్తే వరుణుడు కరుణిస్తాడనే నమ్మకం గ్రామస్తులకు ఉంది. గ్రామానికి చెందిన పాతతరం 90 కుటుంబాల వరకూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం గ్రామ సమీపంలోని దర్గా వద్దనున్న అక్కదేవతలు (మట్టి గుర్రాలు)కు గ్రామంలోని ఇంటికో మనిషి చొప్పున వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామదేవతలైన కట్టమీద గంగమ్మ, బాట గంగమ్మ, నడి వీధి గంగమ్మకు, కుర వీధి భజన మండపాల వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనాదిగా ఆచరించే మొక్కుల సంప్రదాయాన్ని పాటించారు.

వర్షం కోసం..

వర్షాలకోసం అక్కగార్లకు పూజలు, చిత్తపొంగళ్లు, కప్పదేవరలు చేయడం కొత్తేమీ కాదు. వర్షాలు కురవకపోతే అక్కగార్లకు పూజలు చేయడం, చిత్తకార్తెలో పొంగళ్లు పెట్టి, బలిచ్చిన జంతువుల రక్తంలో వేపాకులను తమ పొలాల్లో చల్లడం ఇక్కడ ఆనవాయితీ. ఇక్కడ ముస్లింలు, హిందువులు కప్పదేవర చేస్తుంటారు. రోకలిబండకు ఇరువైపులా రెండు బతికున్న కప్పలను కట్టి వీధుల్లో వాటిపై బిందెలలో నీటినిపోస్తూ వరుణుడు కరుణించాలని చేసే ప్రత్యేక పూజ ఇది! ఇప్పుడు అక్కగార్లకు పూజలు చేశాక తప్పకుండా వర్షాలు కురుస్తాయని మడవళి వంశానికి చెందిన పూజారులు ఆశాభావం వ్యక్తం చేశారు.





బైరెడ్డిపల్లెలో అక్కదేవతలకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యాలు



బాట గంగమ్మ ఆలయంలో పూజలు